

ఖాకీకి

లంచాలు మరిగి నేరస్థులకు సహకారం

అవినీతి మరక !



- కొందరి వల్ల పోలీస్‌శాఖకు అప్రతిష్ట
- జరుగుతున్న ఘటనలే నిదర్శనం
- సొంతింటిని చక్కదిద్దేందుకు ఉన్నతాధికారుల యత్నం
- తవ్వేకొద్దీ వెలుగులోకి అవినీతి వ్యవహారాలు
- ఇద్దరిపై వేటు సరే.. మిగిలినవారిని తప్పిస్తారా ?



> కొందరు పోలీసుల పనితీరుతో హిందూపురం పోలీసు శాఖ అపఖ్యాతి మూటకట్టుకుంటోంది. కొందరి అవినీతి వల్ల శాఖ ప్రతిష్ట దెబ్బతింటోంది. కొద్ది రోజులుగా హిందూపురం సబ్ డివిజన్లో జరుగుతున్న వరుస సంఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొంత మంది పోలీసులు అవినీతి సొమ్ముకు అలవాటు పడి, పాత నేరస్తులకు సహకరించి, ఉన్నతాధికారుకు దొరికిపోయారు. అయితే ఇందులో ఒకరిద్దరిపై మాత్రమే వేటు వేసి మిగిలిన వారిని తప్పించాలని చూస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రస్తుతం హిందూపురంలో జరిగిన సంఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.
>
> - హిందూపురం, ఆంధ్రజ్యోతి

నేరస్థులతో అంటకాగిన పోలీసులు

కొందరు పోలీసులు హిందూపురం సబ్‌డివిజన్‌లోనే గత దశాబ్ద కాలంగా పని చేస్తూ పాత నేరస్థులతో చేతులు కలిపి అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇటీవల జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పాత నేరస్తులే నిందితులుగా ఉన్నారు. వారిని ఉన్నతాధికారులు పర్యవేక్షణలో విచారిస్తే పలు విషయాలు బహిర్గతమయ్యాయి. ఈక్రమంలోనే కొన్ని పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది పలు నేరాలు చేసిన సందర్భంలో నేరస్థులకు సహకరించినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఆదివారం సస్పెండైన ఇద్దరు కానిస్టేబుళ్ల పాత నేరస్థులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలించే సమయంలో పట్టుబడితే లంచాలు పుచ్చుకుని వారిని తప్పించినట్లు ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైంది. అంతకంటే ఎక్కువ నేరం చేసిన కేసుల్లో నిందితులకు మరికొంత మంది సిబ్బంది సహకరించినట్లు పోలీసులే ఒక వర్గంపై ఆరోపణ చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి, కర్ణాటక మద్యం, పేకాట, కొత్త రకం డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగాయి. అప్పట్లో కొంత మంది సిబ్బంది పాత నేరస్థులతో అంటకాగారనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది సిబ్బంది అసాంఘిక కార్యకలాపాలు దగ్గరుండి చేయించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కానిస్టేబుళ్లు వ్యభిచార గృహాల నిర్వాహకులతో సత్సంబంధాలు పెట్టుకున్నట్లు కొద్దిరోజుల కిందట సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందూపురం మండలంలో ఓ కేసుకి సంబంధించి నిందితులను పోలీస్ స్టేషన్‌కి తీసుకువస్తూ మార్గమధ్యంలోనే వదిలేశారు. అప్పట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టారు. తాజాగా జరిగిన పరిణామాలతో ఆ ఘటన కూడా వెలుగులోకి వచ్చింది.

ఇద్దరే సస్పెన్షన్

పాత నేరస్థులకు గతంలో జరిగిన కేసుల్లో సహకరించారన్న సమాచారంతో ఇద్దరు కానిస్టేబుళ్లను నేరుగా సస్పెండ్ చేశారు. కానీ ఓ ఏఎస్ఐతో పాటు మరో ఏడుగురు సిబ్బందిపై వేటు వేయకుండా చార్జి మెమో ఇచ్చి, బదిలీతో చేతులు దులుపేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఇద్దరిని మాత్రం సస్పెండ్ చేసి మిగతావారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పోలీసులే ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులే కొంతమందిని బలవంతంగా వెంటబెట్టుకుని వచ్చి తమకు వ్యతిరేకంగా చెప్పించారని సస్పెండైన ఇద్దరు కానిస్టేబుళ్లే చెబుతున్నారు. గతంలో చేసిన తప్పిదాల్లో భాగం పంచుకుంటున్న అధికారులపై ఏమి చర్యలు తీసుకుంటారని వారు ప్రశ్నిస్తున్నారు. తాము కానిస్టేబుళ్లు కావడంతోనే బలిపశువులని చేశారని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

సొంతింటిని చక్కబెట్టడానికి..

ఇటీవల హిందూపురానికి వచ్చిన పోలీసు అధికారులు సొంత ఇంటిని చక్కబెట్టే పనిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఐదు నుంచి పదేళ్ల పాటు హిందూపురంలో పనిచేసి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులతో అంటకాగుతూ విధులు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్న సిబ్బందిని గుర్తించే పనిలో ఉన్నారు. సుమారు. 15 నుంచి 20 మంది సిబ్బందిపై వివిధ కోణాల్ల లోతుగా విచారణ చేపడుతున్నారు. ఇద్దరు సస్పెండ్ కాగా మరో 8 మందిపై వేటు పడుతుందని భావిస్తున్నారు. ఒక సబ్‌డివిజన్‌లో పదిమంది సస్పెండ్ అయితే పోలీసుశాఖ పరువు పోతుందని భావించి చర్యలకు ఉన్నతాధికారులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన పోలీసులను వెనుకేసుకురావడానికి పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.



పోలీసు శిక్షణ కళాశాలలో డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి, డీజీపీ

పోలీసుల ప్రతిష్ట పెంచండి

- సాంకేతికతతో నేరాలను కట్టడి చేయండి
- కలలను సాకారం చేసుకున్నారు.. అభినందనలు
- ఐదేళ్లలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- ఇక అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- హోం మంత్రి వంగలపూడి అనిత
- ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

అనంతపురం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను కట్టడి చేయాలని పోలీసులకు హోం మంత్రి అనిత సూచించారు. గంజాయి మత్తులో, రాజకీయ ముసుగులో ఎంతో మంది నేరాలకు పాల్పడుతున్నారని ఆమె అన్నారు. పోలీసుల ప్రతిష్టను పెంచేలా బాధ్యతగా నడుచుకోవాలని శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది డీఎస్పీలకు సూచించారు. నగరంలోని పోలీసు శిక్షణా కళాశాలలో డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రొబేషనరీ డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు హాజరైనందుకు ఎంతో ఆనందంగా ఉందని..

(మిగతా 4వ పేజీలో)

జగన్ పాలనలో ప్రాజెక్టులు నిర్వీర్యం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి
- తుంగభద్ర గేట్ల ఎత్తు పెంచడంపై గోప్యత ఎందుకు..?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

5

హంద్రీనీవాతో నీటి సమస్యకు చెక్

ఎమ్మెల్యే కందికుంట



హంద్రీనీవా నీటిని వదులుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా నీటితో నియోజకవర్గ ప్రజల నీటి కష్టాలు తీరుతాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ముదిగుబ్బ మండలంలోని నాగారెడ్డిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి మెయిన్ కెనాల్ నీటిని విడుదల చేశారు. తలుపుల, ఎన్పీకుంట మండలాల నీటి కష్టాలు హంద్రీనీవానీటితో తీరిపోతాయన్నారు. భూగర్భజలాలు సైతం పెరుగుతాయన్నారు. హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాలతోపాటు పట్టణవాసులకు తాగునీటి కొరత లేకుండా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

అన్ని ప్రాంతాలకు సాగు నీరు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



ఏడో మరువ వద్ద గంగపూజ చేసి నీటిని విడుదల చేస్తున్న శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగు నీరు అందించాలన్నదే లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ధర్మవరం చెరువు మరువ పారుతున్న నేపథ్యంలో ఆయన రావులచెరువు గ్రామానికి మంగళవారం నీటిని విడుదల చేశారు. ఏడో మరువ వద్ద పూజ చేసి తూములు ఎత్తి నీటిని విడుదలచేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం రావులచెరువుకు నీటిని విడుదల చేశామని, దీంతో ఈ మార్గంలో ఉన్న మల్లాకాల్వ, సి.బత్తలపల్లి ప్రాంతాల్లో కూడా భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ధర్మవరం చెరువు నుంచి వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. జిల్లాని హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, విజయసారథిచౌదరి, మేకల రామాంజి, చిన్నూరూ విజయ్‌చౌదరి, అమరాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్ల రాజ్యం..!



- రెవెన్యూ శాఖలో వారు చెప్పిందే వేదం
- ఇష్టారాజ్యంగా భూ మార్పులు
- ఆందోళనలో రైతులు

తనకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ శాఖలో బ్రోకర్ల హవా సాగుతోంది. పట్టాదారు పాస్‌పుస్తకం కావాలన్నా, పాస్ పుస్తకంలో నెంబర్లు ఎక్కాలన్నా, వన్‌బీ రావాలన్నా, రెవెన్యూకు సంబంధించిన ఏచిన్నపని జరగాలన్నా బ్రోకర్లను ఆశ్రయించాల్సిందే. అలా అయితేనే పని జరుగుతుంది. బ్రోకర్లు నేరుగా రెవెన్యూశాఖ అధికారులను సంప్రదించి పనిని బట్టి రేటు నిర్ణయించి వసూలు చేస్తారు. ఇచ్చిన సొమ్మును బట్టి పనులు సాగుతాయి. ఇటీవల మండలంలోని మల్లిరెడ్డిపల్లి గ్రామంలో కొందరు బ్రోకర్లు పాత స్టాంపులు చూపించి, భూముల్లో హక్కు లేకపోయినా, ఉన్నట్లు చూపారు. పలు గ్రామాల్లో భూములకు సంబంధించిన లావాదేవీలు రెవెన్యూ చట్టానికి విరుద్ధంగా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

గ్రామాల్లో వివాదాలు

బ్రోకర్లను సంప్రదిస్తే చాలు అర్హులు కాకపోయినా, హక్కు లేకపోయినా, రెవెన్యూ అధికారుల అండతో వారి పేరును వన్‌బీల్లో చేర్చి, భూములపై హక్కులు కల్పించేలా చూస్తారు. దీని ద్వారా గ్రామాల్లో వివాదాలు ఏర్పడి, గొడవలు జరుగుతున్నాయి. భూముల ఫ్రీహోల్డుకు సంబంధించిన విషయంలో కూడా బ్రోకర్లు, రియల్టర్లు చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజనుల భూములకు సంబంధించి ఎలాంటి సమాచారం చెప్పకుండ ఫ్రీహోల్డు రైడ్స్‌లో చేర్చకుండా, ఫైల్స్‌ను వెనక్కు పంపుతున్నట్లు విమర్శలున్నాయి. గ్రామంలో ఇప్పటికే పూర్వం పట్టాలు ఉన్నవారికి తెలియ కుండా, ఆభూముల్లోనే ఇతరులకు పట్టాలిచ్చినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరికొంత మంది కర్ణాటకకు చెందిన రియల్టర్లు యథేచ్ఛగా అసైన్డు భూములను కొనుగోలు చేస్తున్న పట్టించుకునేవారే లేరు. మల్లిరెడ్డిపల్లి గ్రామంలో 710, 520 సర్వేనెంబర్లలో హక్కుదారులు కాకుండా హక్కులేనివారికి అవకాశం కల్పించారని రైతులు వాదన బలంగా వినిపిస్తోంది. రెవెన్యూ అధికారులు చేసిన పొరపాట్లు, తప్పిదాల వలన పలు గ్రామాల్లో వివాదాలు, కోర్టులకే కాకుండా, ఎస్సీ,ఎస్సీ కమిషన్ల వద్దకు కూడా వెళ్లాయి.

నాభూమిపై ఇతరులకు 1బీ ఇచ్చారు



717 సర్వేనెంబర్‌లో 4.67ఎకరాల భూమిని 1957లో మా పెద్దలు కొనుగోలు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకునే సమయంతో మేమిద్దరు అన్నదమ్మలు కలిసి స్టాంపులు, జిరాక్స్ ఇస్తే 4ఎకరాల 17సెంట్లు పాసు పుస్తకాల్లోకి ఎక్కించారు. మిగిలిన 50సెంట్లు అలాగే మిగిలిపోయింది. ఇటీవల బ్రోకర్ల ప్రమేయంతో మాకు చెప్పకుండా, నోటీసులు ఇవ్వకుండానే మా 50 సెంట్లు భూమిని ఇతరులకు ఇప్పించారు. దీంతో మేము వారితో కొట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- వెంకటరమణ, రైతు, పెద్దపల్లి

విచారణ చేపడతాం

మల్లిరెడ్డిపల్లిలో భూ వివాదాలకు సంబంధించి ఇంత వరకు నా దృష్టికి రాలేదు. ప్రస్తుతం భూ వివాదాలకు సంబంధించి హక్కుదారులకు నోటీసులు జారీ చేస్తాం. ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే నిజమైన హక్కుదారులకు హక్కు కలిగేలా చర్యలు చేపడతాం.

- శోభాసువర్ణమ్మ, తహసీల్దార్

వివాదాలకు ఆజ్యం..



సర్వేనెంబర్ 520లో మాతాతలకాలం నుంచి మాకు భూమి ఉంది. మేమే అనుభవించుకుంటున్నాం. అందుకు సంబంధించిన రికార్డులున్నాయి. మాభూమిని బ్రోకర్ల హవాతో ఏమాత్రం సంబంధం లేని వారికి వన్‌బీ కేటాయించారు. దీంతో గ్రామాల్లో రెవెన్యూ అధికారులే వివాదాలకు ఆజ్యం పోసినట్లు ఉంది. భూములకు సంబంధించిన విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనడానికి మాగ్రామంలో జరుతున్న సంఘటనలే అద్దాం పడుతున్నాయి.

- రంగారెడ్డి, రైతు, పెద్దపల్లి

పారదర్శకంగా ఎన్నికలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా జలవనలరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు చెరువులకింద 230 స్థానాలకు, మూడు ప్రాజెక్టులకు ఈనెల 23న ఎన్నికలు నిర్వహించేందుకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సిద్ధం కావాలన్నారు. ఓటరు జాబితా తయారీ తప్పులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో విజయసారథి, ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాధర్, ఆర్‌డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, మహేశ్, శర్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులతోపాటు వివాదాలు, భూకబ్జాలపై బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను రెవెన్యూ, పోలీసులు సకాలంలో పరిష్కరించాలన్నారు. పీఓఏ చట్టం అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు 105 కేసులు ఉన్నాయని, ఇందులో పరిహారం కోసం రూ.4.8కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ.75లక్షలు కేటాయించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు వీరనారాయణ, శ్రీనివాసులు, రామాంజినప్ప, ఉమాశంకర్, శ్రీనివాసనాయక్, గంగులయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిలో ఈఓఆర్డీలే కీలకం

డీపీఓ సమత



మాట్లాడుతున్న డీపీఓ సమత

పుట్టపర్తిరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పంచాయతీలను అభివృద్ధి పరచడంలో ఈఓఆర్డీలు కీలకపాత్ర పోషించాలని జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధిపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి డీపీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈఓఆర్డీలు గ్రామస్థాయిలో పర్యటించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, రక్షిత తాగునీటిపై ప్రత్యేక చర్యల తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు, నూతన గృహాల నిర్మాణాలు, వాటికి సంబంధించిన అనుమతులు, సీసీడ్రైన్లు, సాలిడ్‌లిక్విడ్ మేనేజ్‌మెంట్ పంక్షనింగ్‌ను 80శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ఉపయోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పంచాయతీల రికార్డులను తనిఖీ చేసి పీఆర్ యాప్‌లలో పన్ను వసూలు అంశాలను పొందుపరచాలన్నారు. ప్రతినెలా ఎంత పన్ను వసూలు చేసారన్న సమాచారం అప్‌డేట్‌గా ఉండాలన్నారు. అనంతరం పంచాయతీ నిధుల వినియోగం అబివృద్ధి కార్యక్రమాలపై విడివిడిగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్పీఓలు శివకుమారి, శివనారాయణ, అంజినప్ప, జిల్లాలోని 32 మండలాలకు సంబంధించిన ఈఓఆర్డీలు, ఎంఆర్‌సీలు హాజరయ్యారు.


బెస్ట్ ఆల్ రౌండర్ జీవనకు కప్పును అందజేస్తున్న హోం మంత్రి అనిత


బెస్ట్ ఇండోర్ పురస్కార గ్రహీత ప్రదీప్తికి మెడల్


అమ్మతో అభిషేక్ ఆనందం


ఎన్ని గెలిచానో చూడండి..(జీవన)


హోం మంత్రి అనిత, డీజీపీతో ప్రొబేషనరీ డీఎస్పీల గ్రూప్ ఫొటో


తల్లితో ఆనందం పంచుకుంటున్న కదిరికి చెందిన ప్రొబేషనరీ డీఎస్పీ భవాని


సాధించావు నాన్నా..


పాల్గొన్న ప్రొబేషనరీ డీఎస్పీల కుటుంబ సభ్యులు


హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు


కుటుంబ సభ్యులతో జ్ఞాపకం...



పబ్లిక్‌లోకి 12 సింహాలు





కలలను సాకారం చేసుకుని.. ఖాకీ వనంలోకి...

అనంత పీటీసీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

అనంతపురం పోలీసు శిక్షణా కళాశాల నుంచి పన్నెండు పోలీసు సింహాలు పబ్లిక్‌లోకి అడుగు పెట్టాయి. ఏకంగా యాభై వారాలపాటు వివిధ అంశాలలో శిక్షణ పొంది.. శాంతిభద్రతల పరిరక్షణకు బయలుదేరాయి. వీరికి వీడ్కోలు పలికేందుకు, దిశా నిర్దేశం చేసేందుకు రాష్ట్ర హోం మంత్రి అనిత, పోలీస్ బాస్ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథులుగా వచ్చారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీటీసీ ప్రిన్సిపాల్.. ఐజీపీ వెంకట్రామిరెడ్డి సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలో కొత్త డీఎస్పీలు ప్రతిజ్ఞ చేశారు. కల సాకారమైన వేళ.. అయినవారి సమక్షంలో మధుర క్షణాలను ఉద్విగ్నంగా గడిపారు.

"నేను భారత దేశానికి, భారత దేశ రాజ్యాంగానికి విధేయంగా ఉంటానని, ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థలో నిజాయతీతో వ్యవహరిస్తానని, నిష్పక్షపాతంగా, నిర్భయంగా రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తానని, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల హక్కులను గౌరవిస్తూ, నాకు అప్పగించిన విధులను, కర్తవ్యాలను చట్ట సమ్మతంగా నిర్వర్తిస్తానని మనఃపూర్వకంగా ప్రమాణం చేయుచున్నాను"

అని పలికే క్షణాల కోసం.. వారు ఎంతగా శ్రమించి ఉంటారు..! ఇంకెంతగా తపించి ఉంటారు..! 2023 బ్యాచ్‌కు చెందిన 12 మంది డీఎస్పీలు వీరు. గత ఏడాది నవంబరు 20న శిక్షణకు హాజరయ్యారు. దిగ్విజయంగా శిక్షణ పూర్తి చేసుకుని ప్రభుత్వం అప్పగించే విధుల కోసం సిద్ధమయ్యారు. ఈ పన్నెండు మందిలో ఏడుగురు మహిళలు ఉండటం విశేషం.

డిప్యూటీ తహసీల్దార్ భవాని.. డీఎస్పీ

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గంజివారిపల్లి చెందిన తలుపుల చెన్నకృష్ణయ్య, తులసి దంపతుల కూతురు భవాని. చెన్నకృష్ణయ్య కదిరిలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేస్తున్నారు. బీటెక్ పూర్తి చేసిన తరువాత భవాని టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. కానీ నచ్చక రాజీనామా చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఉద్యోగం సాధించి, అగ్రికల్చర్ డైరెక్టరేట్‌లో పనిచేశారు. అనంతరం గ్రూప్-2 పరీక్షలు రాసి.. డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించారు. కడప జిల్లాలో ప్రొద్దుటూరు సమీపంలోని చాపాడులో డీటీగా పనిచేశారు. ఆ ఉద్యోగంతోనూ ఆగకుండా.. పోలీసు శాఖలో చేరాలని సంకల్పించారు. గ్రూప్-1కు కష్టపడి చదివారు. డీఎస్పీ పోస్టు సాధించారు.

లక్ష్యం చేరిన ఉదయ పావని



విజయనగరం జిల్లాకు చెందిన కెల్లా ఉదయపావని ఇంజనీరింగ్ చదివారు. బీటెక్ పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వైపు వెళ్లలేదు. ప్రభుత్వ అధికారిగా పనిచేస్తేనే తన చదువుకు అర్థం ఉంటుందని భావించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. 26 ఏళ్లకే గ్రూప్-1 పరీక్షతో సత్తా చాటి.. డీఎస్పీ పోస్టు సాధించారు.

అభిషేక్ ... రెండో ఉద్యోగం



తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రావూరి రామ సదాసాయి అభిషేక్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆ వెంటనే ప్రభుత్వ ఉద్యోగ వేట ప్రారంభించారు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఏసీఐఓ-2గా ఎంపికయ్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే.. మరింత ఉన్నత ఉద్యోగం సాధించాలని భావించారు. ప్రజల కోసం నేరుగా ఏదైనా చేయాలని భావించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్-1 పరీక్షలు రాశారు. 2023లో డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

డెంటల్ ఆఫీసర్.. మానస



హైదరాబాద్‌కు చెందిన కడులూరు మానస వైద్యవిద్యను అభ్యసించారు. సికింద్రాబాద్ ఈసీహెచ్ఎస్‌లో డెంటల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఆమెకు సమాజ సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. పోలీసు అధికారి అయితే తన లక్ష్యం నెరవేరుతుందని భావించారు. గ్రూప్-1 ఉత్తీర్ణత సాధించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తానని ఆమె అన్నారు.

ఇంజనీరింగ్ పావని.. డీఎస్పీ



గుంటూరు జిల్లాకు చెందిన బొంత పావని బీటెక్ చదివారు. ఆ తరువాత ఎంటెక్ పూర్తి చేశారు. కానీ సాఫ్ట్‌వేర్ ఫీల్డ్ వైపు వెళ్లలేదు. ప్రభుత్వ ఉద్యోగం, అందులోనూ గ్రూప్-1 స్థాయి అధికారిగా పనిచేస్తే ఎక్కువ మంది ప్రజలకు సేవ చేయొచ్చని భావించారు. ఆ దిశగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీ పోస్టు సాధించారు.

అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణ.. డీఎస్పీ



తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కడాలి జయక్రిష్ణ ఇంజనీరింగ్ చదివారు. ఆ తరువాత పలు పోటీ పరీక్షలు రాశారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంపికయ్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టు సాధించారు.

అలీ.. రెండు ఉద్యోగాలను దాటి..



కడప జిల్లాకు చెందిన పాలగిరి అష్రఫ్ అలీ బీటెక్ పూర్తి చేశారు. కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేశారు. ఆ తరువాత ఐడీబీఐలో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం సాధించారు. ప్రజల సమస్యలను నేరుగా విని.. వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఆలోచన ఆయనది. అందుకే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని భావించారు. గ్రూప్-1 కోసం పట్టుదలగా కృషి చేశారు. డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

డాక్టర్ చైతన్య.. డీఎస్పీ

కాకినాడకు చెందిన మోకన వెంకట క్రిష్ణ చైతన్య వైద్య విద్యను అభ్యసించారు. డెంటల్ డాక్టర్‌గా వృత్తిని స్వీకరించారు. కానీ ఎక్కడో అసంతృప్తి. ప్రభుత్వ అధికారిగా ప్రజా సేవకు అంకితం కావాలని నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారూ ప్రోత్సహించారు. దీంతో గ్రూప్-1పై దృష్టి సారించారు. ఆయన పట్టుదలకు ఫలితంగా 2023లో గ్రూప్-1లో డీఎస్పీ పోస్టు వరించింది.

పోలీసు సింహాల్లోకి.. రాజసింహం



పల్నాడు ప్రాంతానికి చెందిన వెన్నా రాజసింహారెడ్డి ఇంజనీరింగ్ చదివారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఆ ఉద్యోగం ఆయనకు సంతృప్తినివ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనేది ఆయన కల. గ్రూప్-1 కోసం గట్టిగా కృషి చేశారు. డీఎస్పీ పోస్టు సాధించారు. పోలీస్ అధికారిగా ప్రజలకు సేవ అందించడమే తన లక్ష్యమని ఆయన అంటున్నారు.

కడప బిడ్డ.. శివప్రియ



కడప జిల్లాకు చెందిన అంకిరెడ్డిపల్లి శివప్రియ ఇంజనీరింగ్ అభ్యసించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. కానీ సంతృప్తి అనిపించలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టు సాధించారు.

ప్రదీప్తి.. ఎస్ఐ.. డీఎస్పీ..



శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రదీప్తి ఇంజనీరింగ్ చదివారు. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించి.. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఇంకాస్త పెద్ద ఉద్యోగం సాధించాలని భావించారు. గ్రూప్-1 పరీక్షకు సిద్ధమయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

చిన్నారి జీవన.. డీఎస్పీ



అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన జీవన బీఎస్సీ పూర్తి చేశారు. చదువుతున్న సమయంలోనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. అదే సమయంలో గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెంటనే బరిలోకి దిగారు. 23 ఏళ్లకే డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న 12 మంది డీఎస్పీలలో జీవన చిన్నవారు. ఇప్పుడిప్పుడే చదువు పూర్తి చేసుకుని.. ఉద్యోగం కోసం ప్రయత్నించాల్సిన 'చిన్నారి జీవన..' ఏకంగా డీఎస్పీగా తల్లిదండ్రుల ముందు నిలిచారు. ఇంతకంటే వారికి ఆనందం ఏముంటుంది..?




మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, పీటీసీ ప్రిన్సిపాల్.. ఐజీపీ వెంకటరామిరెడ్డి


డీఐజీ షిమోషి, అనంత ఎస్పీ జగదీష్, శాంతి భద్రతల విభాగం ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్




నాలుగో సింహ గర్జన

పోలీసుల ప్రతిష్ఠ పెంచండి

(3వ పేజీ తరువాయి)

హోం మంత్రి అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు ఈ వేదిక ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

కలల సాకారం..

డీఎస్పీలుగా శిక్షణ పూర్తి చేసుకున్నవారు ఎంతో కష్టపడి, నిద్రలేని రాత్రులు గడిపి అనుకున్నది సాధించారని, కలలను సాకారం చేసుకున్నారని హోం మంత్రి అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విధుల్లో చేరబోతున్నారని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడే వృత్తిని ఎంచుకోవడం హర్షనీయమని అభినందించారు. పోలీసు ఉద్యోగం మిగతా వాటిలా కాదని, 24 గంటలు పని చేయాల్సి ఉంటుందని అన్నారు. నిజాయతీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధి నిర్వహణలో నిబద్ధత కలిగి ఉండాలని అన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

పోలీసు శాఖకు ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హోం మంత్రి అన్నారు. గత ఐదేళ్లల్లో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ప్రస్తుతం తమ ముందు అనేక సవాళ్లు ఉన్నాయని అన్నారు. పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉందని అన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడమంటే ఆయుధాలు ఇవ్వడమో.. వాహనాలు ఇవ్వడమో కాదని, పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడమని అన్నారు. ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రొబేషనరీ డీఎస్పీలుగా విధుల్లోకి వెళుతున్న నేపథ్యంలో బాధ్యతగా వ్యవహరించి, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు.

అప్‌డేట్ కావాలి: డీజీపీ

మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు అప్‌డేట్ కావాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. సైబర్ నేరాలు విస్తృతమయ్యాయని, వాటి కట్టడి కోసం ప్రతి జిల్లాలో సైబర్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. సైబర్ ఫోరెన్సిక్ కోసం కొత్త పరికరాలను కొనుగోలు చేస్తామని తెలిపారు. వైట్ కాలర్ క్రైం, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, నార్కోటిక్స్ కట్టడి కోసం ప్రభుత్వం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. మానసిక వేదనకు గురిచేసే సోషల్ మీడియా క్రైం నియంత్రణకు తగిన చర్యలు చేపట్టబోతున్నామని అన్నారు. రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని, ఈ విషయాన్ని మరువకూడదని అన్నారు. పోలీసులను ఆశ్రయించే వారిపట్ల మరింత సానుభూతితో ఉండాలని సూచించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ప్రతిజ్ఞ మేరకు నిష్పక్షపాతంగా, నిర్భయంగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. పదవీ విరమణ పొందే వరకూ ప్రతిజ్ఞలోని అంశాలను మరువకూడదని అన్నారు. మానవ హక్కులను కాపాడుతూ, రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని డీజీపీ వారికి పిలుపునిచ్చారు.

ప్రతిభావంతులకు పతకాలు

శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాలలో ప్రతిభ చాటిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోం మంత్రి చేతులమీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్, ఐజీపీ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, ఉమ్మడి జిల్లా ఎస్పీలు జగదీష్, రత్న, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మేయర్ వసీం, ఏఎస్పీలు, డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ప్రొబేషనరీ డీఎస్పీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





దీవెనలు.. శుభాకాంక్షల వెల్లువ...






వీక్షిస్తున్న ట్రైనీ ఎస్ఐలు

న్యూస్‌బాక్స్

నేడు ప్రత్యేక గ్రామసభలు
కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరవు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం రూరల్, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో కరవు నివారణ చర్యల్లో భాగంగా వివిధ పనులకు ఆమోదంతో తీర్మానాలు చేసి పనులు చేపడుతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు విషయం తెలియజేయాలన్నారు.

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 21, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ. 34 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,250తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 23వేలు, సరాసరి రూ. 26 వేలుతో అమ్ముడుపోయాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

స్క్రీనింగ్ టెస్టుకు హాజరుకావాలి

పుట్టపర్తిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ సాధికారత సంచాలకులు శివరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించబడుతుందన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం
రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక రూడ్ సెట్ సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ ఉరవకొండ ప్రభుత్వ ఐటీఐలో 13 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఈనెల 13వతేదీ నుంచి 30రోజులపాటు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఆధార్, రేషన్ కార్డు ఉన్న మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479 లను సంప్రదించాలని కోరారు.

నేడు 20వ మహాజనసభ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య 20వ వార్షిక మహాజనసభ బుధవారం స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలో ఉన్న టీటీడీసీలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు షేక్‌బీ, రాధమ్మ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత మహాసభ సమావేశాలపై సమీక్ష, 2023-24 ఆర్థిక సంవత్సరంలో లెక్కలు, ఆడిట్, నివేదికపై చర్చిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. అనంతరం పాలకవర్గసభ్యుల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

గోరంట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరి కాలనీలో బోదగిరి మల్లికార్జున ఇంటి ముందు ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. మల్లికార్జున చేనేత మగ్గాలు నిర్వహిస్తున్నాడు. ఇంటి ముందు ఏర్పాటు చేసిన కొట్టం కింద ద్విచక్ర వాహనాలు ఉంచాడు. ఆ వాహనాలు పాక్షికంగా కాలిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపిక


జయంత్ కృష్ణ

అనంతపురం క్లాకటవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మల్టీ డే జట్టుకు జిల్లా క్రీడాకారుడు జయంత్ కృష్ణ ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీకి ఏపీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.


మిరప పూతపై పదుల సంఖ్యలో నల్ల నల్లి పురుగులు

లిపేస్తున్న నల్లి


మిరప ఆకు కింది భాగంలో సోకిన ఎర్ర నల్లి

మిరప పంటలో ఎర్ర, నల్లనల్లి ఉధృతి

- విల్ట్, ఆకుముడతతో అన్నదాత కుదేలు
- పూత, పిందె దశలో ఎండిపోతున్న పంట
- పురుగు మందులు వాడినా నిష్ప్రయోజనం
- పెరిగిన పెట్టుబడితో రైతన్న విలవిల


ఆకు ముడత సోకి ముడతలు పడిన మిరప పంట

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మిరప రైతులను తెగుళ్ల కష్టాలు వీడటం లేదు. గత ఏడాది వర్షాలు, గిట్టుబాటు ధర లేక మిరప రైతులు లక్షల్లో నష్టపోయి అప్పుల పాలయ్యారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడితో లాభాలు వస్తాయని ఆశించిన రైతన్నకు తెగులు రూపంలో నిరాశే ఎదురవుతోంది. జూలై నెలలో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం మంచి పూత, కాయ దశలో ఉంది. అయితే వర్షాలు అధికం కావటంతో తెగుళ్ల ఉధృతి పెరిగింది. గత ఏడాది లాగే ఈసారి కూడా నల్ల నల్లి పురుగుతో పాటు ఎర్ర నల్లి కూడా ఆశించింది. రెండు రకాల పురుగులు సోకటంతో మిరపకాయలకు మచ్చలు ఏర్పడి ఎర్రకాయలు కూడా నల్లగా మారి కుళ్లి పోతున్నాయి. ఎర్రనల్లితో కిందిభాగంలో ఎర్రగా మారి ఆకులు మొత్తం ఎండి పోతున్నాయి. నల్ల నల్లి పురుగుతో పూత మొత్తం రాలి పోతోంది. నల్లి పురుగు ఆకులను గోకటం వల్ల ఎర్రగా మారి ఎండిపోతాయని రైతులు తెలపుతున్నా రు. రైతులు వాటిని నివారించేందుకు వారాని రెండు సార్లు పురుగు మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కసారి పురుగు మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ.12 వేల నుంచి 15 వేలు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

విల్ట్, ఆకు ముడత కూడా...


విల్ట్‌తో మచ్చలు పడి ఎండిన మిరప కాయలు

మిరప పంటకు ఎర్రనల్లి, నల్లనల్లికి తోడు విల్ట్, ఆకు ముడత(బింగి) కూడా సోకింది. ఏ తెగులును అదుపు చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల మిరప పంటకు ఆకు ముడత(బింగి), విల్ట్ సోకి పూర్తిగా ఎండి పోయాయి. కొన్ని నల్లి దెబ్బకు కాపు నిలబడకుండా పోయాయి. హెచ్చెల్సీ జీబీసీ, హంద్రీనీవా కాలువ కింద అధికారికంగా వివిధ రకాల మిరప పంటలను 20 వేల ఎకరాల్లో సాగు చేశారు. విడపనకల్లు మండలంలో 10700ఎకరాల్లోను, వజ్రకరూరు మండలంలో 3200 ఎకరాల్లోను, ఉరవకొండ మండలంలో 3600 ఎకరాల్లోను, కూడేరు మండలంలో 1600 ఎకరాల్లోను, బెళుగుప్ప మండలంలో 2500 ఎకరాల్లోను మిరప పంటను సాగు చేశారు. గత ఏడాది 45వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. కానీ నల్లి గెబ్బకు, గిట్టుబాటు ధరలు లేక పోవటంతో ఈ ఏడాది 50శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ. లక్ష నుంచి 1.5లక్ష వరకూ పెట్టు బడులు పెట్టారు. ఎకరాకు కనీసం 5 క్వింటాళ్ల దిగుబడి వస్తే పెట్టుబడి అయిన కొంత తిరిగి వస్తుందని రైతులు చెబుతున్నారు.


నల్లి పురుగు నివారణకు మిరప తోటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసిన రైతు

కాపుదశలో పంటలు దెబ్బ తింటున్నాయి

మూడు ఎకరాల్లో మిరప సాగు చేశా. పురుగులు నివారణకు రకరకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. వారానికి రెండు సార్లు మందులు వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం మిరపకు ఎర్ర నల్లి, నల్ల నల్లి ఆశించడంతో ఎదుగుదల లేకుండా పోయింది. కాయలు ఎర్రబారుతున్న సమయంలో నల్లి దెబ్బకు మచ్చలు ఏర్పడి పంట ఎదుగుదల లేకుండా పోయింది. పంట ఎదుగుదలకు ఎరువులతో పాటు నీళ్ల మందు వాడుతున్నా. అయినా పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

\- నాగరాజు, రైతు

విల్ట్‌తో వాడు ముఖం: సురేష్, రైతు



మూడు ఎకరాల్లో కడ్డీ రకం మిరప సాగు చేశా. వర్షాలు అధికమై తేమ ఎక్కువ కావటంతో పంటకు విల్ట్ తెగులు సోకింది. రకరకాలు మందులు వాడినా ప్రయోజనం లేదు. పంట మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది ఇప్పటికే ఎకరాకు రూ. లక్ష వరకూ పెట్టుబడులు పెట్టా. కనీసం పెట్టుబడి కూడా తిరిగి రాకుండా పోతోందని భయంగా ఉంది. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.

జాగ్రత్తలతోనే రక్షణ: నెట్టికల్లు, హార్టికల్చర్ అధికారి



పంట సాగు చేసినప్పటి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎర్రనల్లి, నల్లనల్లి నివారణకు నీమ్ ఆయిల్ 3ఎంఎల్‌లు, అసిపేట్ 1.5గ్రాములు లీటర్ నీటికి కలిపి మిరప మొక్కలపై పిచికారీ చేయాలి. గుడ్డును నివారించ గలిగితే పురుగును నివారించినట్టే. ప్రాపరగేట్ 2ఎంఎల్‌లు లేదా ఒబెరాన్ 1ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి మొక్కలపై పిచికారీచేయాలి. తెల్ల దోమ నివారణకు ప్రతి పొలంలోను పసుపు రంగు అట్టలను ఎకరాకు 40నుంచి50 వరకు ఏర్పాటు చేయాలి. విల్ట్ నివారణకు పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలి. సాలల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలి. మిరపను సాగు చేసే సమయంలో పంట ఎండ బెట్టకు గురి కాకుండా చూడాలి. మిరప పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను మేర సాలల్లో సాగు చేయాలి. 25నుంచి30మైక్రాన్ మల్చింగ్ వేసుకొని డ్రిప్ పద్ధతిలో మొక్కలకు సాగు నీరు పెట్టాలి. దీని ద్వారా పురుగు ఉధృతిని అరికట్ట వచ్చు.

పంట మొత్తం ఎండిపోతోంది: గంగన్న, రైతు



నేను 8 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశా. ఆకుముడత తెగులు, ఎర్రనల్లి తెగులు సోకి పచ్చని పంట పొలం మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. ఎకరాకు ఒక క్వింటా, రెండు క్వింటాళ్ల దిగుబడి రావటం కూడా కష్టంగా మారింది. పెట్టుబడికి ఇప్పటికే రూ. 8లక్షలకు పైగా అయ్యింది. ఎకరాకు మూడు క్వింటాళు కూడా దిగు బడి రావటం కష్టంగానే ఉంది. దాదాపుగా రూ. 8లక్షలు పెట్టుబడి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

జగన్ పాలనలో ప్రాజెక్టులు నిర్వీర్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

బళ్లారి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నయాపైసా నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా రైతులు కష్టాలు పడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బళ్లారిలో ఆయన బళ్లారి జిల్లా కార్యదర్శి ఆదిమూర్తి ఇతర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ నిర్లక్ష్యంతోనే తుంగభద్ర ఆయకట్టు రైతులు కష్టాలు పడ్డారన్నారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టు అయిన తుంగభద్రకు జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. మరమ్మతులను పట్టించుకోకపోవడంతోనే క్రస్ట్ గేటు కొట్టుకుపోయిందన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర సరిహద్దు వద్ద ఎగువ, దిగువ కాలువలు అధ్వానంగా ఉన్నాయని, డ్యాం నుంచి 4,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా కనీసం 1500 క్యూసెక్కుల నీరు పారేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. అయితే సీఎం చంద్రబాబునాయుడుకు నీటి ప్రాజెక్టులపై ఆసక్తి అధికమని, నిధులు విడుదల చేసి రైతులకు మేలు చేస్తారన్నారు. ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమర్థుడని, బడ్జెట్ సమావేశాల్లో తుంగభద్రకు నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగభద్ర క్రస్ట్ గేట్ల ఎత్తును 2020-22 మధ్య అడుగు ఎత్తు పెంచారని, ఈ విషయాన్ని అధికారులు ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. పెంచిన అడుగులో నీటిని పరిశ్రమలకు ఇస్తే అభ్యంతరం లేదన్నారు. వాస్తవాలు వెల్లడించాలన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు
పలు మండలాల్లో కేసులు

అనంతపురంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ విభాగం ఈఈ శ్రీహరి ఆధ్వర్యంలో రాప్తాడు, ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో గృహ కనెక్షన్ తీసుకుని వ్యాపార సముదాయాలకు వాడుతున్నవారిని గుర్తించి 8 కేసులు, తీసుకున్న లోడు కన్నా అదనంగా వినియోగిస్తున్న వారిపై 17 కేసులు, మీటర్ ఉండి డైరెక్ట్‌గా కరెంటు వాడుతున్న వారిపై 15కేసులు నమోదు చేశారు. రూ.3.5లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఈఈ నాగేంద్ర, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

రబీ వేరుశనగ సబ్సిడీ ధర ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రబీ వేరుశనగ సబ్సిడీ ధరలను ఎట్టకేలకు ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటాల్ వేరుశనగ పూర్తి ధర రూ.9600గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3840 పోను రైతు వాటా కింద రూ.5760 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్‌కు జిల్లాకు 6671 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఒక్కో రైతుకు ఐదెకరాల దాకా గరిష్ఠంగా మూ డు బస్తాలు (30కేజీల బస్తాలు) పంపిణీ చేస్తారు. గురువారం నుంచి జిల్లా లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు - 2025 ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. అలాగే రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు, రూ. 200 ఫైన్‌తో ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు, రూ. 500 ఫైన్‌తో వచ్చే నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

క్రిస్మస్ హైటీకి నిధులివ్వండి
- మంత్రికి స్వామిదాస్ వినతి

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రిస్మస్ హైటీ నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి జిల్లాకు రూ.1.50 లక్షలు మంజూరుచేశారని, ప్రస్తుతం ప్రతి జిల్లాకు రూ.3 లక్షలు మంజూరు చేయాలని కోరారు. చర్చిలకు ప్రాపర్టీ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కార్తీక పూజలు



ఆత్మకూరు నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కార్తీకమాస ప్రత్యేకపూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టు తిప్పి, అనంతరం అలంకరించారు. పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారు కవచసేవ, పల్లకి సేవ, ఆకుపూజ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాముస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాచిగూడ-యలహంక ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు

గుంతకల్లు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యలహంక (17603/04) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఐదు అదనపు బోగీలను జతచేసి పంపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు రెండు 2-టైర్ బోగీలు, ఒక 3-టైర్ ఏసీ బోగీ, ఒక స్లీపర్ బోగీ, ఒక జనరల్ బోగీని శాశ్వత ప్రాతిపదికన జత చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్లిప్ బోగీల తొలగింపు..

వాస్కోడిగామా-షాలిమార్ (17225) రైలుకు, కాచిగూడ-యలహంక (17603/04) రైలుకు ఉన్న స్లిప్ బోగీలను తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6వ తేదీ నుంచి, వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి స్లిప్ బోగీలను తొలగించనున్నట్లు వారు తెలిపారు.

'పీఎం సూర్య ఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి అవసరం ఉందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు గురించి జిల్లా విద్యుత్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకం గురించి వినియోగదారులకు వివరించి రూఫ్‌టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోవడం వలన కరెంటు బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం కింద అన్ని జాతీయ బ్యాంకులు 80శాతం రుణాలను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఈఈటీ ప్రసాద్, ఈఈలు జేవీ రమేష్, రాజశేఖర్, డీఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

క్రైంకార్నర్

రేషన్ షాపు కోసం ఘర్షణ... నలుగురికి గాయాలు

ముదిగుబ్బ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.బండ్లపల్లిలో చౌకధరల ధాన్యపు డిపో కోసం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. బండ్లపల్లి గ్రామంలో రేషన్ షాపు మాకు కావాలని ఒక వర్గం, కాదు మాకే కావాలని మరో వర్గం సోమవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ రెండు వర్గాల మధ్య పాతగొడవలు ఉన్న నేపథ్యంలోనే రేషన్ షాపు కోసం ఘర్షణ జరిగినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో రమేశ్, అక్కులప్ప, లింగమయ్య, ఆదినారాయణ గాయపడ్డారన్నారు. ఇందులో లింగమయ్య, ఆదినారాయణలను కదిరి ప్రభుత్వాస్పత్రికి, రమేశ్, అక్కులప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బధిర మహిళపై అత్యాచార యత్నం

సోమందేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బధిర, ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పెడబల్లి రామాంజనేయులు సోమవారం అర్ధరాత్రి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన బధిరురాలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి రామాంజనేయులు తలుపు తట్టాడు. ఆమె ఎవరని తలుపు తీయగా చేయి పట్టుకుని లాగి అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి, అతడి బారి నుంచి తప్పించుకుని గ్రామంవైపు పరుగులు తీసింది. దీంతో అతను పరారయ్యాడు. బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రాఘవన్ తెలిపారు. కాగా బాధితురాలికి ఎనిమిదేళ్ల కిందట కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తితో వివాహం అయ్యింది. అతను వదిలేయడంతో స్వగ్రామంలోనే ఉంటూ కూలీనాలి చేసి జీవనం సాగిస్తోంది.

చెస్ పోటీల్లో నలుగురికి పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో నగరానికి చెందిన నలుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల ఏలూరులో ఏపీ మొదట చెస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్-10 ఓపెన్ కేటగిరిలో కాగిత సాయి యశస్ ఐదు రౌండ్లలోనూ తిరుగులేని ఆధిక్యతను చాటి విజేతగా నిలిచాడు. వాసు సాయి మనోజ్‌కృష్ణ ఐదు రౌండ్లకు గాను నాలుగు రౌండ్ల ఆధిక్యతతో తృతీయ స్థానంలో నిలిచాడు. అవుతి సుకృత ఐదు రౌండ్లలో మూడు రౌండ్లలో గెలిచి నాలుగో స్థానంలో నిలిచింది. పల్లమనేని మనస్వి మల్కా నాలుగో స్థానంలో నిలిచింది. కోచ్ గుత్తి రవితో పాటు విజేతలను చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిరాజు అభినందించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక గణేష్ సర్కిల్‌లో మంగళవారం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో వర్షాలు రాకపోవడంతో లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు కాలేదన్నారు. తుఫాన్ వల్ల అరకొరగా పండిన పంట కూడా తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు ఇవ్వాల్సిన పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, రైతుసంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు కాటమయ్య, జాన్సన్‌బాబు, ఆంజనేయులు, మహదేవ్, చంద్రశేఖర్‌రెడ్డి, చలపతి, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కదిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కుమార్, నందిని దంపతులు. మనస్పర్థలు రావడంతో నందిని కొన్ని రోజుల క్రితం పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసముంటున్న తన తల్లి రత్నమ్మ వద్దకు వచ్చింది. ఈనెల 4న (సోమవారం) బయటకెళ్లిన నందిని తిరిగి రాలేదు. దీంతో రత్నమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

● అధ్యాపకుడు... : పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఖాజామహమ్మద్ ఇక్బాల్ స్థానిక టైటానిక్ ఫంక్షన్ హాల్ వద్ద నివాముంటున్నాడు. ఈనెల 4న (సోమవారం) ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. అతని భార్య షబాన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. అప్పుల భారంతో వెళ్లి ఉండవచ్చని షబాన అనుమానం వ్యక్తం చేసింది.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

కదిరి అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ యూటీఎఫ్ కమిటీని స్థానిక ఎమ్మార్సీ ఆవరణంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా మధుసూధన్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిరాజేష్, గౌరవాధ్యక్షుడిగా ఎస్. షమీమ్, ఉపాధ్యక్షులుగా వెంగమనాయుడు, ప్రత్యూషా, కోశాధికారిగా జయకిషోర్, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్. మధుసూధన్, భార్గవ్, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా మధుసూధన్‌రెడ్డి, ఉమా, కార్యదర్శులుగా పవన్, అనీల్, శ్రీనివాసులు, జేబీబుల్లా, మల్లికార్జున, షబానాబేగం, బి. క్రిష్టప్పను ఎన్నుకున్నారు.

ఏబీవీపీ కమిటీ ...

ఓబుళదేవరచెరువు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల నూతన కమిటీని మంగళవారం ఆ సంఘం జిల్లా కన్వీనర్ వాసుదేవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెంకటసాయి ఐటీఐ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్‌గా నందీప్, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, తరుణ్, షమీమ్, నందు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని జైబీమ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మైనొద్దీన్‌కు ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఉద్యోగులకు కొత్త డిజిటల్ చార్టు వేయాలని, బస్సుల కండీషన్ మెరుగుపరిచాలని, డ్రైవర్లు రాస్తున్న ఫిర్యాదులను ప్రతిరోజు సెక్షన్ ఇన్‌ఛార్జీ పరిశీలించాలన్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేటు వాహనాలను నియంత్రించాలని, బస్సులకు నాణ్యమైన విడిబాగాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, ఎస్వీ నాయక్ పాల్గొన్నారు.


విద్యార్థులకు మెమొంటో అందచేస్తున్న ప్రిన్సిపాల్

టీటీలో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుంతకల్లులో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నీస్ పోటీల్లో కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్. శ్రావణి, ఎస్. సల్మా, బి సింధూ విన్నర్స్‌గా నిలిచినట్లు పీడీ నరసింహచారి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆ విదార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి జ్యోతి


జ్యోతి

నంబులపూలకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని తూర్పునడింపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జ్యోతి అండర్-14 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైంది. బాపట్లలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. జ్యోతిని ప్రధానోపాధ్యాయులు మురళిక్రిష్ణ, పీఈటీ సుహాసిని, ఉపాధ్యాయులు అభినందించారు.

రహదారులపై దుమ్ము తొలగించాలి

కొత్తచెరువు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని దుమ్ము విపరీతంగా ఉందని, దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు విజ్ఞప్తి చేస్తున్నాడు. మంగళవారం ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులకు ఆయన వినతి పత్రం అందజేశారు. భారీ వాహనాలు వెళ్లినప్పుడు పెద్దఎత్తున దూళి ఎగిసి పడుతోందని, దీంతో ఇతర వాహనదారులు ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆ రోడ్లపై పేరుకుపోయిన దుమ్మును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మోటారు, కేబుల్ చోరీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉట్లవారిపల్లికి చెందిన బి. భాస్కర్‌రెడ్డి పొలంలోని మోటారు, కేబుల్ వైర్, పంపుసెట్ సోమవారం రాత్రి చోరీ అయ్యాయి. ఇటీవల బోరులో నీరురాక పోవడంతో ఉన్న మోటారును తొలగించి, దాని స్థానంలో ఎక్కువ సామర్థ్యమున్న మరో మోటారు అమర్చారు. తొలగించిన మోటారు, కేబుల్‌వైరు, పంపుసెట్‌ను పొలంలోనే ఉంచారు. మంగళవారం ఉదయం భాస్కర్‌రెడ్డి పొలంలోకి వెళ్లి చూడగా అవి చోరీ అయినట్లు గుర్తించి.. పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

జీతాల కోసం 104 సిబ్బంది వినతి


జోత్స్నకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

పుట్టపర్తిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమకు బకా యి ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 104 సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జోత్స్నకు మంగళవారం వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగు లకు అరబిందో యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు మోహన్‌బాబు, నరేష్, డీఇఓ లక్ష్మీపతి పాల్గొన్నారు.

● నల్లమాడ : తమకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండలంలో 104 సిబ్బంది రెడ్డిపల్లి వైద్యుడు గణేనాయక్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ.. వేతనాలు అందక.. కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోయారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరవిందో యజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి తమకు చెల్లించాలన్నారు. 74మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలుచేయాలన్నారు. తమసమస్యలను కుటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, డ్రైవర్ల నరసింహలు, బాబు, డీఈఓ కే. అబ్దుల్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.


గణేనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

నేడు గ్రామ సభలు

తాడిమర్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నీటిసంరక్షణ పనులను గుర్తించేందుకు ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో బుధవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంకటరంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఈ గ్రామసభలు జరిగేలా చూడాలన్నారు. అన్ని గ్రామసభలు ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాలని, అదేవిధంగా పంచాయతీ పరిధిలోని నీటి సంరక్షణ పనులు గుర్తించి రిజిస్ట్రర్‌లో నమోదు చేయాలని తెలిపారు. మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ గ్రామసభలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

● గాండ్లపెంట : మండలంలోని 14 పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. కరువు నివారణ చర్యలో భాగంగా పనుల్లో ఆయా పంచాయతీల్లో ఉపాధి పథకంలో చేపట్టనున్న పనులపై సమీక్షిస్తామన్నారు. పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

● నంబులపూలకుంట : మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనమ్మ, ఏపీఓ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కరువు మండలంలో చేపట్టాల్సిన పనులపై సమీక్షిస్తామన్నారు. ఈ సభలకు నాయకులు, ప్రజలు పాల్గొన్నాలని కోరారు.


అనంతపురంలో హోం మంత్రి అనితను సన్మానిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

విత్తనాభివృద్ధి కార్యాలయ పరిశీలన

ధర్మవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విత్తనాబివృద్ధి కార్యాలయాన్ని ఏపీసీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య మంగళవారం పరిశీలించారు. అక్కడ వేరుశెనగ, కంది, జొన్నలు తదితర వాటిని పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తన కాయలను అందజేయాలని ఆయన సూచించారు.

మద్యం దుకాణాలు ...

ఓబుళదేవరచెరువు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మద్యం దుకాణాలను తనకల్లు ఎక్సైజ్ సీఐ మారుతిరావు, సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గుడికి, బడికి వంద మీటర్లకు పైగా దూరం మద్యం దుకాణాలు ఉన్నాయా.. లేదా అని పరిశీలించారు. వారి వెంట ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వండి

పుట్టపర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ చేతన్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన త్రైమాజిక జిల్లా స్థాయి స్కావెంజర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు తదితర వాటిని అందించాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ఆయా కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకే గుర్తించిన పారిశుధ్య కార్మికుల జాబితాను ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి తెప్పించుకుని రీ సర్వే చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, ఎల్‌డీఎం రమణకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రామ్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధక కమిటీల ఏర్పాటు

తనకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి, బొంతలపల్లి, బాలసముద్రం గ్రామాల్లో బాల్యవివాహ నిరోధక కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ మంగళ వారం తెలిపారు. బాల్యవివాహా లను అరికట్టడానికి ప్రతి గ్రామం లోనూ 11 మంది సభ్యులతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు చైర్మన్లుగా, మహిళ పోలీసులు కన్వీనర్లుగా, కార్యద ర్శులు, వీఆర్‌ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయ సంఘాలకు చెందిన ఓ మహిళ, పంచాయతీ వార్డు సభ్యురాలు, ఏఎన్ఎం, ఎన్జీఓ ప్రతినిధి, యూత్ అసోషియేషన్ ప్రతినిధి, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజులమ్మ, మహిళ పోలీస్ చిట్టెమ్మ, కార్యదర్శి ఉదయ్, పలువులు మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరుశనగ వామికి నిప్పు



కాలి బూడిదైన వేరుశనగ వామి

గోరంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూగానిపల్లి చాకలి నారాయణప్పకు చెందిన వేరుశనగ వామికి సోమవారం రాత్రి దుండగులు నిప్పు పెట్టారు. దీంతో కాయలు ఉన్న వేరుశనగ కట్టె పూర్తిగా దగ్ధమైంది. గ్రామ సమీపంలోని వొద్దుగుట్టదిన్నె పొలంలో టీడీపీకి చెందిన నారాయణప్ప రెండు ట్రాక్టర్ల కాయలతో ఉన్నవేరుశనగ కట్టెను వామివేసి భద్రపరిచారు. కాయలు వేరు చేయకనే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. దీంతో దాదాపు రూ. 75వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

జీవోలను వెంటనే విడుదల చేయాలి



డాక్టర్ శృతికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

గోరంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశ కార్యకర్తల యూనియన్, సీఐటీయూ రాష్ట్ర నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందం మేరకు జీవోలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కమాల్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతికి ఆశ కార్యకర్తలతో కలిసి ఆయన ఆశ దినోత్సవం సందర్భంగా మంగళవారం వినతి పత్రం అందించారు. ప్రభుత్వంతో చర్చలు జరిగి 9 నెలలు కావస్తున్నా జీవోలు విడుదల కాకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

పెనుకొండ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రొద్దం మండలం నారనాగేపల్లి జడ్పీ హైస్కూలులో ఆర్డీటీ మహిళాభివృద్ధి శిశుసంక్షేమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్నవయసులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురై ప్రసవ సమయంలో తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం బాల్య వివాహాలు చేసుకున్నా, నిర్వహించినా, సహకరించినా శిక్షార్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ మేనేజర్ మల్లికార్జున, టీమ్‌లీడర్ ఆదినారాయణ, ఎస్ఐ నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

లేపాక్షి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచిసముద్రం గ్రామం పొలిమేరలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ నరేంద్ర కుమార్ తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తసుకుని వారి నుంచి రూ.7,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి కోర్టుకు పంపుతామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం సొంతం



నవదీపక్

లేపాక్షి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పులమతి విద్యార్థి ప్రతిభ కనబరచి కాంస్యం సొంత చేసుకున్నాడు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తెనాలిలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 10వ తరగతి చదువుతున్న నవదీపక్ 102 ప్లస్ కేటగిరిలో కాంస్య పతకం సాధించాడన్నారు. విజయం సాధించిన విద్యార్థిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మధుమేహంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మేఘన

గోరంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేచురోపతి వైద్య నిపుణురాలు బైసాని మేఘన మాట్లాడుతూ మధుమేహ వ్యాధిని నేచురోపతి వైద్యం ద్వారా నయం చేయవచ్చని వివరించారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సి ఆహారం, తదితర విషయాలను సూచించారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు రఘురామిరెడ్డి, రెడ్డికేశవప్రసాద్, శ్రీరాములు, గోవిందురెడ్డి, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు రాజేష్, పద్మరేఖ, దస్తగిరి పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా

గుడిబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడిబండ చేపల చెరువు వేలంపాటను వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. మంగళవారం నిర్వహించాల్సిన చేపల చెరువు వేలంపాట అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. వేలంపాట తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు కార్యదర్శి తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

అమరాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మారప్ప(70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఆర్ఐ విన్సెంట్‌పాల్ మృతుడి భార్య గోవిందమ్మకు రూ.15వేలు దహన సంస్కారాలకు అందించారు. తహసీల్దార్ మారుతీప్రకాష్, సిబ్బంది భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జైబీమ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మైనోద్దీన్‌కు ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఉద్యోగులకు కొత్త డిజిటల్ చార్టు వేయాలని, బస్సుల కండీషన్ మెరుగుపరిచాలని, డ్రైవర్లు రాస్తున్న ఫిర్యాదులను ప్రతిరోజు సెక్షన్ ఇన్‌ఛార్జీ పరిశీలించాలన్నారు.

ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్ను

● ఆర్అండ్‌బీ స్థలం చదును ● పట్టించుకోని అధికారులు ● ఫిర్యాదు చేశామంటున్న ఏఈ.. లేదంటున్న సీఐ



ఆక్రమణకు గురైన ఆర్అండ్‌బీ స్థలం ఇదే..

హిందూపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్నారు. పొరపాటున స్థల యజమానులు దూరంగా ఉంటే ఆక్రమించుకొని దొంగ రికార్డులు సృష్టించి అది మా స్థలమే అంటూ గద్దల్లా వాలిపోయి చేతులు మార్చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొందరు కబ్జాదారులు ప్రభుత్వ స్థలంపై కన్నేశారు. హిందూపురం నుంచి పరిగికి వెళ్లే దారిలో మోతుకపల్లి వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని 13 సెంట్ల ఆర్అండ్‌బీ స్థలంపై కొందరి కన్ను పడింది. ఆ ప్రాంతంలో సెంటు రూ. 25 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన ఆ స్థలం విలువ రూ. 3 కోట్లకు పైమాటే. ఇంత విలువైన స్థలంలో ఆక్రమణదారులు యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తుంటే ఆర్అండ్‌బీ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారిలో ఆక్రమణదారులు స్థలాన్ని చదును చేస్తున్న విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ మోహన్‌కు సమాచారం అందించామని స్థానికులు అంటున్నారు. ఇంత వరకు స్పందించలేదంటే వారికేమైనా లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా అని అక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు. భారీగా ముడుపులు అంది ఉంటాయని, అందుకే నిరక్ష్యంగా ఉన్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశా : మోహన్, ఏఈ, ఆర్అండ్‌బీ

మోతుకపల్లి వద్ద ప్రధాన రహదారి పక్కన ఆర్అండ్‌బీకి చెందిన 13 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో ఎవరో కొంత మంది చదును చేసి బండలు నాటారు. ఆ విషయం స్థానికులు నాకు తెలియజేశారు. అక్కడికి వెళ్లి పరిశీలించాను. అక్కడ నాటిన బండలపై ఉన్న ఫోన్ నెంబర్లను వన్ టౌన్ సీఐకి అందించి ఫిర్యాదు చేశాను.

ఫిర్యాదు అందలేదు: రాజగోపాలనాయుడు, సీఐ, వన్‌టౌన్

మోతుకపల్లి వద్ద స్థలం ఆక్రమణకు గురైనట్లు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి నాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తా. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. దౌర్జన్యాలు, రౌడీయిజం చేస్తే ఉపేక్షించేదిలేదు.

కళాశాల ఫీజులతో లింకు పెట్టొద్దు : ఎస్ఎఫ్ఐ



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళాశాల ఫీజుతో పరీక్ష ఫీజులకు లింకు పెట్టవద్దని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కళాశాల హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలల్లో మూడు, ఐదో సెమిస్టర్ ఫీజులు కట్టడానికి ఎస్కే యూనివర్సిటీ అధికారులు గడువు విధించారని అన్నారు. గత సంవత్సరం వైసీపీ ప్రభుత్వం విద్యాదీవెన అందించలేదదని, దీంతో విద్యార్థులు కళాశాల ఫీజులు పెండింగ్ ఉన్నాయన్నారు. కళాశాల యాజమాన్యాలు పరీక్షా రుసుంతో పాటు పెండింగ్ ఉన్న కళాశాల ఫీజులు చెల్లించాలని షరతులు విధించడం తగదని పేర్కొన్నారు. తల్లితండ్రులు కూడా వేదనకు గురవుతున్నారని అన్నారు. కళాశాల యాజమాన్యం ఫీజుల కట్టించుకోకపోతే విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తాము గెలిచిన వెంటనే ఫీజు రీఇంబర్స్‌మెంట్ చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. పరీక్ష ఫీజులు కట్టించుకోని కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు చంద్రశేఖర్, ఆఫ్రిద్, హుసేన్, తరణ్, బాబా ఫక్రుద్దీన్, కిరణ్, రంగ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అంతరాయం

విద్యుత్ కోతలతో మడకశిర ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

మడకశిరటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తరచూ విద్యుత్ అంతరాయంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మడకశిర పట్టణంలో 4.30 గంటల నుంచి రాత్రి సుమారు 7 గంటలైనా విద్యుత్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మధ్య కాలంలో తరచూ విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులను ఎప్పుడు అడిగినా విద్యుత్ అంతరాయం విషయంలో చిన్న సమస్యలు అంటూ దాటవేస్తున్నారు. మారుతీనగర్‌లో రాత్రి 8 గంటలయినా రాలేదు. గంటల తరబడి పట్టణంలోనే విద్యుత్ అంతరాయం ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ పట్టణ వాసులు చర్చించుకొంటున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఒక్క రోజు ఆలస్యమైనా జరిమానా వేయడం, విద్యుత్ నిలిపివేస్తున్నారని, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకొన్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలపై ముళ్లకంపలు పడినా, వైరు తెగిపడినా రెండు మూడు రోజులైనా మరమ్మతులు చేయకపోవడం వల్ల ఆ పరిసర ప్రాంతాల్లో కోతలతో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. పసిపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



భవనాలను ప్రారంభిస్తున్న అభయ ఫౌండేషన్ చైర్మన్

పెనుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని అభయఫౌండేషన్ చైర్మన్ బాలచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అభయ ఫౌండేషన్ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన భోజనశాల ఆడిటోరియం భవనాల ప్రారంభోత్సవాన్ని హెచ్ఎం జ్యోతిర్మయి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాలచందర్‌తో పాటు సాహితీ గగన్మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి హాజరై భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వీటికితోడు దాతలు ముందుకొచ్చి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి



వరి పొలంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ

హిందూపురం/పెనుకొండ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు ఇచ్చిన సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఏడీ అల్తాఫ్‌అలీఖాన్ అన్నారు. మంగళవారం హిందూపురం మండలం మలుగూరువద్ద మొక్కజొన్న, కంది, వరిపంట సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సలహాలు, సూచలన అందించారు. సేంద్రీయ పద్దతుల్లో వ్యవసాయం చేస్తే ఖర్చుతగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ సురేంద్రనాయక్, ఉద్యానశాఖ అధికారి మహేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగుతో అధిక దిగుబడులు లభిస్తాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీ సనావుల్లా తెలిపారు. రొద్దం మండలం నారనాగేపల్లి, జక్కులచెరువు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులు సాగుచేసిన కంది, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నివేదిత, ఏఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై 'అపార్' ఒత్తిడి తగదు: ఎస్టీయూ

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ నమోదు ప్రక్రియలో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం తగదని, వాటి కార్డుల జారీ కోసం ఆధార్ సవరణ కేంద్రాలను జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం వారు ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన విద్యావిధానంలో భాగంగా ఒకే దేశం, ఒకే ఐడెంటిటీ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఐడీ క్రియేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందుకు విద్యార్థుల పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నంబర్, అడ్మిషన్ రిజిస్టర్ యూ డైస్‌లో ఒకేలా ఉన్నప్పుడే ఐడీ క్రియేట్ అవుతుందన్నారు. అయితే ప్రతి పాఠశాలలో మెజారిటీ విద్యార్థులకు వివరాలు సరిపోలడం లేదని, వాటిని సవరించుకోవడానికి ఆధార్ సవరణ కేంద్రాలు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఈ క్రమంలో అపార్ ఐడీ నమోదుతో ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతోందన్నారు. నెల రోజులుగా వారు ఈ ప్రక్రియతో తిప్పలు పడుతున్నారన్నారు. మరోవైపు ఎస్ఏ ఎంపీ 2 పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులపై అపార్ నమోదు వేగవంతం చేయాలని ఒత్తిడి తీసుకురావడం తగదని అన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, యూడైస్‌లో సవరణలను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల ద్వారా సవరించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. అపార్ నమోదు గడువు పెంచాలని, సరైన ఆధారాలతో అడ్మిషన్ రిజిస్టర్లో వివరాలు సవరించుకోవడానికి అవకాశం కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆలయం పర్యవేక్షణ, సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు ఆలయ ఈఓ వాణికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఆలయానికి రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోందని, కానీ ఇక్కడ సౌకర్యాలు మాత్రం మెరుగుపడడం లేదని అన్నారు. వసతి గదుల్లో ఫ్యాన్లు, ఏసీలు సక్రమంగా పనిచేయటం లేదని, పార్కుల్లో చెత్తచెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. వెంటనే వాటిని మెరుగుపరచాలని కోరారు. అలాగే భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత ప్రసాదం, రాత్రిసమయాల్లో అన్నదానం కొనసాగించాలని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సమితి కన్వీనర్ ఆర్ శ్రీనాథ్‌గౌడ్, కో-కన్వీనర్లు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి గ్రామ స్థాయి నుంచి జరగాలి : జడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం విద్య/న్యూటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో గ్రామాలు సుభిక్షంగా ఉండాలంటే గ్రామ స్థాయి నుంచే అభివృద్ధి సాగాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల ప్రారంభ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం ఆవిష్కృతం కావాలంటే అభివృద్ధి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఇలా పరంపరగా కొనసాగాలన్నారు. పంచాయతీరాజ్ మూడంచెల వ్యవస్థలో గ్రామాలే కీలకం అన్నారు. పంచాయతీ శాఖ పరిధిలో పనిచేసే అధికారులు ఈ శిక్షణాకార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య, ఇతర డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

శిక్షణలో చెప్పిన అంశాలు అమలు చేయాలి: డీపీఓ

జీపీడీఎస్ (గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ స్కీమ్) అమలులో భాగంగా తయారుచేసే అంచనాలకు సంబంధించి శిక్షణలో చెప్పే అంశాలు అమలు జరిగేలా చూడాలని డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. నగర శివారులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు విభాగాల అధిపతులు హాజరై సూచనలు చేస్తారన్నారు. అందుకు అనుగుణంగా జీపీడీఎస్ తయారు చేయాలన్నారు. అన్ని వివరాలు ప్రణాళిక ప్రకారం ఇవ్వాలన్నారు.

హోంమంత్రి దృష్టికి పోలీసు సమస్యలు



హోంమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత మంగళవారం అనంతపురం జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పోలీసు సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలను ఆమెకు వివరించారు. వాటి పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



అలేఖ్య

పెనుకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అలేఖ్య రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు దివాకర్‌యాదవ్ తెలిపారు. ఇటీవల అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 అథ్లెటిక్స్ జిల్లా స్థాయిలో పోటీల్లో అలేఖ్య డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికయిందన్నారు. ఈనెలలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ హనుమంతనాయక్ అభినందించారు.

ఫుట్‌బాల్ క్రీడల్లో బంగారు పతకం



క్రీడాకారులు చందన, కిషోర్

మడకశిర రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ అండర్-14 క్రీడా పోటీల్లో కల్లుమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు చందన, కిషోర్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డి, పీడీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థులు భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయలు విద్యార్థులను అభినందించారు.

బుచ్చివారిపల్లిలో గంగమ్మకు జ్యోతులు



జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

గోరంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చివారిపల్లి గ్రామస్థులు మంగళవారం గంగమ్మ జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని చెరువు 20 యేళ్ల తరువాత నిండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. చెరువుకట్టపై ఉన్న గంగమ్మ గుడి వరకు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు జ్యోతులతో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. గంగమ్మకు శాంతి పూజలు చేశారు. ప్రజలను, పాడిపంటలను కాపాడాలని వేడుకున్నారు.

గ్రామీణ రోడ్లకు భూమి పూజ

పావగడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న లింగదహళ్లి, అరసికెరె రోడ్లకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అరసికెరె లింగదహళ్లి ప్రముఖ వాణిజ్య కేంద్రాలుగా పేరు గాంచినా ఇక్కడ రవాణా సౌకర్యానికి రోడ్ల వ్యవస్థ లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 15 సంవత్సరాల నుండి ఈ రోడ్డుపై ప్రయాణించేవారు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. రూ.10.8 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేయడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ శంకర్‌రెడ్డికి మూడు నెలల్లోపు పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

కదిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కదిరి మున్సిపల్ యూటీఎఫ్ కమిటీని స్థానిక ఎమ్మార్సీ ఆవరణంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు తెలిపారు. పట్టణఅధ్యక్షుడిగా మధుసూధన్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిరాజేష్, గౌరవాధ్యక్షుడిగా ఎస్. షమీమ్, ఉపాధ్యక్షులుగా వెంగమనాయుడు, ప్రత్యూష, కోశాధికారిగా జయకిషోర్, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్. మధుసూధన్, భార్గవ్, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా మధుసూధన్‌రెడ్డి, ఉమా, కార్యదర్శులుగా పవన్, అనీల్, శ్రీనివాసులు, జేబీబుల్లా, మల్లికార్జున, షబానాబేగం, బి. క్రిష్టప్పను ఎన్నుకున్నారు.